క్లుప్తంగా

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దహెగాం: బలిదాన్ దివస్ సందర్భంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, తోట చందు, దెబ్బటి సత్యనారాయణ, పుప్పాల లక్ష్మీనారాయణ, పడాల సురేశ్, విజయ్, ప్రదీప్ పాల్గొన్నారు.

వర్షం కోసం 'కప్పతల్లి'



కప్పతల్లి ఆడుతున్న ప్రజలు

ఆసిఫాబాద్‌రూరల్: వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజుల గడిచినప్పటికీ వర్షం రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కోసం మండలంలోని మోతుగూడ గ్రామానికి చెందిన రైతులు కప్పతల్లి ఆడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం రాకపోవడంతో చేనులో నాటిన పత్తి గింజలు మొలకెత్తకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

భీమన్న జెండా ప్రతిష్ఠాపన



జెండా ప్రతిష్ఠాపన చేస్తున్న ఆదివాసీలు

పెంచికల్‌పేట్: మండలంలోని మెరెగూడ గ్రామ సమీపంలోని గొంతెమ్మ ఆలయ ఆవరణలోని భీమన్న జెండా ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు భాజభజంత్రీల మధ్య ప్రత్యేక పూజలు చేసి, జెండా సిద్ధం చేశారు. ప్రజలందరూ చల్లగా ఉండాలని, పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

నేడు వర్మీ కంపోస్టు విక్రయ మేళా

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రం ప్రారంభిస్తామని ఎంపీడీవో నస్రుల్లాఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలోని సెగ్రిగేషన్ షెడ్లలో తయారు చేసిన పంట సిరి వర్మీ కంపోస్ట్‌ను అమ్మకానికి కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నేడు మధ్యాహ్నం 12 గంటలకు సేంద్రియ ఎరువుల విక్రయం కేంద్రంను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ప్రారంభిస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: సిర్పూర్(టి) మండలంలోని లోనవెల్లి సబ్‌స్టేషన్ నుంచి కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్ 33 కేవీ విద్యుత్ సరఫరా లైన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కౌటాల విద్యుత్ ఏఈ రవీందర్ ఆదివారం తెలిపారు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లి, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి



మహంకాళి విగ్రహం వద్ద భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవార్ల ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాలోని పలు గ్రామాల భక్తులతో పాటు బెల్లంపల్లి, మంచిర్యాల తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కనకదుర్గాదేవీ, మహంకాళి అమ్మవార్లతో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న శనేశ్వరుడు, కాల భైరవుడు, నాగదేవతల విగ్రహాలను దర్శించుకుని పూజలు చేశారు. ఒడి బియ్యం, పట్టు వస్త్రాలతో పాటు నైవేద్యాలు సమర్పించారు.

అందని 'సహకారం'

- పత్తాలేని సబ్సిడీ ఎరువులు, విత్తనాలు
- పంట రుణాలు, ధాన్యం కొనుగోలుకే పరిమితం
- ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న రైతులు



బెజ్జూర్ పీఏసీఎస్ కార్యాలయం

బెజ్జూర్: రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా సబ్సిడీపై అందించే యంత్ర పరికరాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పంటల సాగు భారంగా మారుతోంది. వానాకాలం సాగు పనులు ప్రారంభమైనా సబ్సిడీ విత్తనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ పీఏసీఎస్ పరిధిలో 2374 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పంట రుణాలు, ధాన్యం కొనుగోలుకే పీఏసీఎస్ సేవలు పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం..

గతంలో పంట సాగులో నూతన పద్ధతులను తెలియజేసి, అవసరమైన యంత్ర పరికరాలు, విత్తనాలు, ఎరువులను పీఏసీఎస్‌ల ద్వారా సబ్సిడీపై అందించే వారు. గత నాలుగేళ్ల నుంచి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సరఫరా కావడం లేదు. దీంతో అన్నదాతలు విత్తన దుకాణాలు, బహిరంగ మార్కెట్లపై ఆధార పడాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావించిన కొంత మంది అక్రమార్కులు రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. పీఏసీఎస్‌ల ద్వారా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

పెట్టుబడి కోసం అప్పులు..

పంట ఉత్పత్తులను విక్రయిస్తే వచ్చే ఆదాయం కంటే సాగు ఖర్చులే అధికంగా ఉంటున్నాయి. దీంతో రైతులు ఏటా అప్పుల పాలవుతున్నారు. సహకార సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. పంట మార్పిడి, సేంద్రియ సాగు, అధిక దిగుబడి ఇచ్చే వంగడాలపై సూచనలు, సలహాలు ఇవ్వాలి. అయితే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. సాగుకు సంబంధించిన యంత్ర పరికరాలు లక్షల్లో ఉంటాయి. వాటిని పేద రైతులు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. ఈసమస్యను గుర్తించిన గత ప్రభుత్వాలు సబ్సిడీపై యంత్రాలను సరఫరా చేసేవి. ప్రస్తుతం ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

వ్యాపారుల దోపిడీ..

సబ్సిడీ విత్తనాలు ఎరువులు అందుబాటులో లేక విచ్చలవిడిగా రైతుల వద్ద యూరియా, డీఏపీలు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. సబ్సిడీ ద్వారా ఒక యూరియా బస్తా రూ.285 ఉండగా, అదే ప్రైవేట్‌లో దాదాపుగా రూ.350 పెట్టుకొని తీసుకుంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో పత్తి ప్యాకెట్‌పై రూ.100 నుంచి రూ.200 సైతం అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



సహకార సంఘం ద్వారా గతంలో యూరియా, డీఏపీతో పాటు కంది, పత్తి విత్తనాలు రాయితీపై అందించేవారు. గత నాలుగేళ్లుగా ఇవ్వడం లేదు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు సరఫరా చేసి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి.

– సపావత్ వినోద్ కుమార్, రైతు, లాంబాడిగూడ

గ్రామదేవతలకు పూజలు



ఇచ్చోడ: పూజలు చేస్తున్న గ్రామస్తులు



తాంసి: పూజలు చేస్తున్న ముదిరాజ్‌లు

ఇచ్చోడ: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటల బాగా పండాలని ముఖరా(బి)లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలతో పాటుగా ఊరి పొలిమేరలో ఉన్న దేవతలకు జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పటేల్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అడప్ మారుతి, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న దేవుడి పండుగ

తాంసి: ప్రతీ ఏటా వర్షాకాలం సీజన్‌లో నిర్వహించే భీమన్న దేవుడి పండుగను ఆదివారం తాంసి మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పులతో గ్రామశివారులో ఉన్న భీమన్న దేవుడి వద్దకు వెళ్లి పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పొచ్చన్న, యువజన విభాగం అధ్యక్షుడు రాఘవేంద్ర, పెద్దలు జీవన్, రమాకాంత్, శ్రీకాంత్, సాయి, వెంకట్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే వరద



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలోని గూడెం(వో) కాలనీలో చిన్నపాటి వర్షానికే రోడ్లపై వరద నీరు చేరింది. రోడ్లపై నిలిచిన వరదతో కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు. సీసీ రోడ్డు ఉన్నా బురదతో నడవడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

ఆదిలాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపాల్టీ తరఫున పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన పట్టణంలోని సంజయ్‌నగర్, పోలీస్‌కాలనీల్లో పర్యటించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండేలా మున్సిపల్ సిబ్బందిచే ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. చెత్త చెదారాన్ని రోడ్లపై వేయకుండా మున్సిపల్ చెత్త వాహనాలకు అందించాలన్నారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై కదలిక



- ప్రకటన చేసిన ప్రభుత్వం
- జిల్లాలో లబ్ధి పొందనున్న 80 వేల మంది రైతులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి సాక్షిగా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని ఆగస్టు 15లోపు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి ఎన్నికల సభలో హామీ ఇచ్చారు. ఈమేరకు పంట రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణమాఫీ అమలు విధివిధానాలపై డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నేతృత్వంలో సబ్‌కమిటీ నిర్ణయిస్తుందని, వచ్చే నెల 15లోపు కమిటీ తమ నివేదికలను అందజేస్తుందని సీఎం ప్రకటించారు. దీంతో జిల్లాలో వివిధ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న సుమారు 80 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

వేలాది రైతులకు లబ్ధి..

జిల్లా వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 1,38,588 మంది పట్టాదారులు ఉండగా.. 1,32,637 మంది రైతులు బ్యాంకు ఖాతాలు అంతర్జాలంలో నమోదు చేసి ఉన్నాయి. వీరిలో దాదాపుగా 80 వేలకు పైగా రైతులు రెండు లక్షలలోపు బ్యాంకు రుణాలు తీసుకొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీతో వీరంతా లబ్ధి పొందనున్నారు.

5 ఏళ్ల కాలానికి..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 డిసెంబర్ 11 వరకు ఉన్న రుణాలను రెండు దఫాలుగా మాఫీ చేయగా, ప్రస్తుత రుణమాఫీలో కట్ ఆఫ్ డేట్ 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ వరకు నిర్ణయించారు. ఐదు సంవత్సరాల పరిమితిలో తీసుకొన్న రుణాలు ప్రభుత్వ నిర్ణయంతో మాఫీ కానుంది.

ప్రతీ హామీని నెరవేరుస్తాం

ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నాం. ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేయగా.. రైతులకు ఎంతో ఆర్థిక చేయూత నిచ్చే రుణమాఫీని ఆగస్టు 15లోపు పూర్తి చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

– విశ్వప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీని ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో చేయడం సంతోషంగా ఉంది. నాకు ఉన్న వ్యవసాయ భూమికి సంబంధించి రూ. 1,60,000 రుణాన్ని తీసుకొన్నాను. ప్రస్తుతం రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించడంతో ఆర్థికంగా రైతులకు మేలు జరుగనుంది.

– గాజుల జక్కయ్య, రైతు, బూర్గుడ

రోడ్డుపై గుంతలతో చింత

- గుంతలమయంగా పెంచికల్‌పేట్ సలుగుపల్లి రహదారి
- గుంతల్లో నిలుస్తున్న వర్షపు నీరు
- ప్రయాణానికి ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా రహదారి

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వెళ్లే ప్రధాన రహదారిపైన పెద్ద గుంతలు ఏర్పడటంతో రోడ్డు గుండా రాకపోకలను సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన రెండేళ్ల నుంచి రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో రహదారిపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు, ఆటోల్లో ప్రయాణాలు సాగించే వారు సైతం అవస్థలు పడుతున్నారు.

15 కిలోమీటర్లు.. గంట ప్రయాణం..

పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వరకు 15కిలోమీటర్ల బీటీ రహదారి ఉంది. గుంతలమయంగా ఉన్న రోడ్డు గుండా 15 కిలోమీటర్లు ప్రయాణం చేయడానికి సుమారు గంటకు పైగా సమయం పడుతుంది. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్సు సైతం నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుంది. పెంచికల్‌పేట్ నుంచి లోడుపల్లి వరకు రోడ్డుపైన ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. బెజ్జూర్ నుంచి పెంచికల్‌పేట్ మీదుగా కాగజ్‌నగర్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతుంది. గుంతలమయంగా మారిన రోడ్డుపైన ప్రయాణాలు చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాల్సిన అధికారులు అటువైపు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో నిత్యం అష్టకష్టాలు పడుతూ గమ్యానికి చేరుకుంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతులు చేయించాలి



ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడటంతో నీరు నిలుస్తుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతల కారణంగా సమయానికి గమ్యానికి చేరుకోలేక పోతున్నాం. నిత్యం రద్దీగా ఉండే రహదారిపైన ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించి ప్రయాణికుల ఇక్కట్లు తొలగించాలి.

– రమేశ్, పెంచికల్‌పేట్

ప్రమాదకరంగా స్తంభం



కెరమెరి మండలంలోని సుల్తాన్‌గూడ గ్రామంలో 11కేవీ విద్యుత్ స్తంభం కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు విన్నవించినా.. పట్టించుకోడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

– కెరమెరి

కెరమెరిలో భారీ వర్షం



కెరమెరిలో కురుస్తున్న వర్షం

కెరమెరి: మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ ఉన్నప్పటికీ ఆతర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వారసంత కావడంతో సంతకు వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు. వ్యాపారస్తులు తమ దుకాణాలను మూసేశారు. వాగులు, కల్వర్టులు పొంగిపొర్లాయి.

పోడు రైతులను అడ్డుకున్న అధికారులు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అంకుసాపూర్ శివారులో ఆదివారం సాగు చేస్తున్న పోడు రైతులను ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. పత్తి విత్తనాలు విత్తుకోవడానికి రైతులు భూముల్లోకి వెళ్లగా.. భూములకు రక్షణగా ఉన్న ఎఫ్ఎస్‌వో బానయ్య, ఎఫ్‌బీవో నవ్యలు అడ్డుకున్నారు. ఈ భూములు అటవీశాఖ పరిధిలో ఉన్నాయని సిబ్బంది, అటవీహక్కు పత్రాలు కలిగి ఉన్నందున 30 యేళ్లుగా సాగు చేసుకుంటున్నామని రైతులు వాగ్వాదానికి దిగారు. కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు.

భగీరథ నీటినే తాగాలి



బావి నీటిని పరీక్షిస్తున్న నాయకులు

బేల: బావి నీటిని తాగితే అనారోగ్యం భారిన పడుతామని, ప్రతీరోజు మిషన్ భగీరథ నీటిని తాగాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఆదివారం మండలంలోని సదల్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. స్థానికంగా ఉన్న బావుల నీటిని పరిశీలించారు. బావి నీళ్ల త్రాగితే ప్రమాదకరమని వివరించారు. భగీరథ నీటిని కూడా వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. ఉరాది దేవేందర్, బోయర్ నరేందర్, గణపతివార్ వెంకట్‌రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సేవ ఎంతో సంతృప్తినిచ్చింది



ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో రాజేశ్వర్

రెబ్బెన: ప్రజా సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. జూలై 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమవేశం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందచేశారు. ఎంపీపీ సౌదర్య మాట్లాడుతూ రాజకీయ అనుభవం లేకపోయినప్పటికీ గత ప్రభుత్వం ఎంపీపీగా ఎంపిక చేసి ప్రజలకు సేవ అవకాశం కల్పించిందన్నారు. ఎంపీటీసీలందరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో రాజేశ్వర్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన: జిల్లాలో మూడు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాగులు, నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో రాజేశ్వర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు ఉప్పొంగే రహదారుల్లో ప్రయాణాలను మానుకోవాలన్నారు. ఈత కోసం, ఉధృతంగా ప్రవహించే వాగు వద్ద సెల్ఫీ ఫొటోలు తీసుకునేందుకు వెళ్లవద్దని సూచించారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం డాన్ టు డెస్క్ అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిల్, కంపాస్ బాక్సులను అందజేశారు.

నిషేధిత గుట్కా విక్రయిస్తే చర్యలు



పట్టుబడిన గుట్కా, పొగాకు ఉత్పత్తులను చూపిస్తున్న ఎస్సై

రెబ్బెన: మండలంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పలు కిరాణ దుకాణాలపై దాడులు నిర్వహించి నిషేధిత గుట్కాను పట్టుకున్నారు. అత్మకూరి శ్రీనివాస్ కిరాణ దుకాణంలో రూ. 5200 విలువైన గుట్కా ప్యాకెట్లు, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై అశోక్, తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయ్‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899